


రామం ఆరేళ్ల పిల్లాడిగా వున్నప్పుడు! వాళ్ల మేనమామగారి పెద్దమ్మాయికి పెళ్లి జరిగింది! ఆ పెళ్లికి, వాళ్ల అమ్మనాన్నలతో బాటు, రామం కూడా వెళ్లాడు. ఎందరెందరో చుట్టాలు వచ్చారు వాళ్ల మామయ్య గారింటికి! తనతోటి పిల్లలు బోళ్లందరుండడంతో రామానికి గంటలు నిముషాల్లా గడిచిపోయాయి!

పదిమంది ఆడాళ్లు ఒకచోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడ వాళ్లమ్మ కూడా వుంది. పరుగుపరుగున వచ్చి రామం వాళ్లమ్మ వొళ్లో కూర్చున్నాడు. తన మనసులో ఉన్న విషయాన్నొక దాన్ని వాళ్లమ్మకి చెప్పేశాడు. "అమ్మా! అందరు పిల్లల్లోకీ నాకు ఒకళ్లే ఒకళ్లు బాగా నచ్చారు! ఎవరో చెప్పనా? రెండు జడ లేసుకుని, తెల్లగా వుందీ! ఆ పిల్ల!"

వాళ్లమ్మ ఒక్కసారిగా నవ్వేసింది. "అయ్యో నీ తెలివి బంగారంగానూ! నచ్చవలసిన వాళ్లే నచ్చారు. ఇంకనేం?" అంది. అంతటితో ఊరుకోకుండా "వదినమ్మా చూశావా మావాడేమంటున్నాడో! అందర్లోకే మీపిల్ల ఒక్కర్తే నచ్చిందట మా వాడికి! పని గట్టుకొచ్చి చెప్తున్నాడు" అంటూ అక్కడున్న ఒకావిడతో చెప్పేసింది! అందరూ గొల్లుమని నవ్వేశారు.

"పిల్లాడి కంటె పిల్ల పెద్దదయినా ఫరవాలేదు! ఇద్దరికీ పెళ్లి చేసెయ్యొచ్చు! రాముడి కంటె సీత పెద్దది కాదేవిటే!" అన్నారు అందులో కొందరు.

రామానికి ఎందుకో మనసు పాడయింది. ఎవళ్లకీ చెప్పకుండా అమ్మ కొక్కద్దానికే చెప్దామనుకుని చెప్తే వాళ్లమ్మ, ఆ విషయం అందరితోటే చెప్పేసింది! అక్కడున్న ఆడాళ్లంతా ఇంకా ఆ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు.

"ఇంకిక్కణ్నుంచి అమ్మకి కూడా ఏదీ చెప్పకూడదు!" అని తనలో తానే అనుకుంటూ అక్కణ్నుంచి వెళ్లిపోయాడు రామం!

పెళ్లి ఎప్పుడు జరిగిందో, అవాడావుడి ఎన్నాళ్లుందో రామానికి తెలియదు! ఒకనాడు సాయంత్రం మాత్రం మామూలుగా ఆడుకుందామని ఆ బొగడ చెట్టు క్రింద కెళ్లేసరికి అంతవరకూ తనతో ఆడకున్న పిల్లలెవ్వరూ కనిపించలేదు! పందిట్లో రాటలు పట్టుకొని ఒకళ్లిద్దరు మాత్రం ఆడుతున్నారు! మామయ్యగారి ఇల్లంతా వెతికేడు. తనతో ఆడిన పిల్లలెవ్వరూ కనిపించలేదు! ఎవళ్లు కనిపించకపోయినా ఫరవాలేకపోను. ఆరెండు జడ లేసుకుని తెల్లగా వున్న పిల్ల కూడా కనిపించలేదు! రామాని కేమీ తోచలేదు! గుండెల్లో అదేదోలాగుంది! ఆ రాత్రి అన్నం తిన బుద్ధి వెయ్యలేదు! తన కదోలాగుందని వాళ్లమ్మతో కూడా చెప్పకూడదు! చెప్తే, ఆడాళ్లంతా మళ్లీ నవ్వేస్తారు!

పందిట్లో ఒకమూలకి పోయి కూర్చున్నాడు రామం! ఆ రెండు జడ లేసుకుని, తెల్లగా వున్న పిల్ల, అందర్లోకీ ఆ పిల్లే బాగుంది! బలే తమాషాగా నవ్వుతుంది! ఆ పిల్లని చూడగానే రామాని కదోలా గనిపించింది! ఆపిల్లతో మాట్లాడుదామంటే తనకు కొంచెం సిగ్గేసేది మొదట్లో! దొంగాటలో ఆపిల్ల తన కళ్లు మూసినప్పుడు ఎంతో బాగుంది తనకి! అప్పు

మోసినా తాను కావాలని తొంగుబోయే వాడు! ఉన్న పిల్లలందర్లో ఆ పిల్లే పెద్దది! ఆపిల్లకి పదేళ్ళుట! ఆ సంగతి నాన్నగారితో అమ్మ చెప్తుండగా తాను విన్నాడు! ఎలాగైనా అందరి పిల్లల్లోకీ ఆపిల్లే ఎంతో బాగుంది! అపిల్ల, ఆ రెండు జడ లేసుకుని తెల్లగా వున్న పిల్ల....

రామం ఆలోచనలకి అంతు చిక్కకుండానే వాళ్ళమ్మ వచ్చి రామాన్ని పిలిచింది! "ఇక్కడ కూర్చుని ఏంజేస్తున్నావురా? ఇంటికి టైమైందిట దాపోదాం!" అంటూ చెయ్యి పట్టుకుని రామాన్ని లేవదీసింది!

రైలుబండి ఎక్కాక కూడా రామానికి ఆపిల్లే గుర్తుకు వస్తోంది, వాళ్ళదేవూరో, అమ్మ నడిగి తెలుసుకుందామనుకుని, మళ్ళీ ఏదో ఆలోచన వచ్చి అడగడం మానేశాడు. బొగడచెట్టు, ఆ పిల్ల, దొంగాట, అలా లీలగా జ్ఞాపకం వస్తూండగానే నిద్రాదేవత వడిలోకి జారిపోయాడు రామం!

ఆ మరునాటి నుంచి అంతా మామూలే! ప్రొద్దున్నే లేవడం, స్కూలుకి వెళ్ళిరాడం, సాయంత్రం ఆడుకోడం! వాళ్ళ వూరు వెళ్ళిన రెండుమూడు రోజుల దాకా కూడా ఆపిల్ల అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చినా, నాలుగైదు రోజులకి ఆ పిల్లనిపూర్తిగా మరచిపోయాడు రామం!

* * *

రామానికి పదకొండేళ్ళు వచ్చాయి! వాళ్ళ మామయ్యగారి రెండో అమ్మాయి పెళ్ళికి వాళ్ళ అమ్మనాన్నలతో రామం కూడా వెళ్ళాడు! అక్కడ బొగడచెట్టు అలాగే వుంది. కొమ్మలు మాత్రం కొంచెం ఎత్తుగా వున్నాయి. దాని చుట్టూ గచ్చు తిన్నవేయించారు! బొగడచెట్టు చుట్టూ ఇంతకుముందు తను వచ్చినప్పుడు ఖాళీ స్థలం వుండేది. ఇప్పుడు రంగురంగుల పూలమొక్కలు బోల్డన్ని లేచాయి! ఆబొగడ చెట్టు కింద చిన్నప్పుడు, తాఆడిన దొంగాటు, ఆ రెండు జడ లేసుకుని తెల్లగా వున్న అమ్మాయి, లీలగా గుర్తుకు వచ్చాయి.!, "ఆ అమ్మాయి కూడా ఈ పెళ్ళికి వచ్చి వుంటుందేమో!" అనుకుని, ఆత్రంగా మామయ్య గారిల్లంతా గాలించడం మొదలెట్టాడు రామం! ఇల్లంతా ఎక్కడ చూసినా చుట్టాలతో చాలా హడావుడిగా వుంది. అన్ని గదులూ వెతికాడు. ఆపిల్ల ఎక్కడా కనుపించలేదు! పెళ్ళికూతురున్న గది ఒకటి మాత్రం చూడాలి! అక్కడికి అందర్నీ వెళ్ళనివ్వటం. చాలామంది ఆడాళ్ళు తలుపు కడ్డంగా నించుని లోపలికి బుర్రలెట్టి ఏదో వింతగా చూస్తున్నారు!

అవతలి వైపు కిటికీ దగ్గర ఇద్దరే ఆడాళ్ళున్నారు! మంచి ఆలోచన దొరికింది రామానికి! ఆ కిటికీ దగ్గర కెళ్ళి ఆ ఆడాళ్ళని బ్రతిమాలుకుని, కిటికీ ఎక్కి కూర్చున్నాడు. లోపల జరిగే వింత చూద్దామని ఊచల మధ్య బుర్రపెట్టి చూచాడు! రామం కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి! కళ్ళప్పగించి రెండు నిముషాలు చూశాడు! తన ఎదుట కనుపించే దృశ్యం చాలా వింతగా వుంది! ఆ రెండు జడల మ్మాయి భరతనాట్యం చేస్తోంది. వాళ్ళక్కయ్యో ఎవరో ప్రక్కన పాట పాడుతూ తాళం వేస్తున్నారు. ఆ రెండు జడల మ్మాయి ఇంతకుముందు తను చూసినప్పుడు కంటె తెల్లగా వుంది! ఇంతకు ముందు పరికిణీలో కనిపించిందల్లా ఇప్పుడు ధగధగ మెరిసిపోయే వోణీలో కనిపిస్తోంది!

ఆ అమ్మాయి తనకేసి ఒక్కసారి చూస్తే బాగుణ్ణనుకున్నాడు రామం! అదేపనిగా, తనను తాను మరచి, ఆ అమ్మాయి నాట్యాన్ని చూస్తున్నాడు! ఆ అమ్మాయి నాట్యం చేస్తూ చేస్తూ, రామం వంక ఒకసారి చూసింది! ఏదో జ్ఞాపకం వచ్చి మరో రెండుసార్లు రామాన్ని చూసింది! రామం అదేపనిగా తనవంక చూస్తుండడం చూసి, ఒక నిముషంపాటు రెప్పవాల్చకుండా రామాన్నే చూసింది! రామం కొంచెం తడబడ్డాడు! వళ్ళంతా ఏదోలాగయింది! సిగ్గుపడిపోయాడు! కిటికీ దిగి అక్కణ్నించి బయటికొచ్చేశాడు! మనసు ఎందుకో కంగారుగా వుంది! గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి! ఆ అమ్మాయి తేరిపారి, తననెందుకలా చూసింది!! తను సిగ్గుపడకుండా ఇంకా అక్కడే ఉండవలసింది! ఛీ! అనవసరంగా వచ్చేశాడు! తిరిగి మళ్ళీ వెళ్తే బాగుండదు! అయినా, ఆ అమ్మాయినే చూడాలని వుంది! ఎలా సాధ్యమవుతుంది! 'పెళ్ళి ఇంకా రాత్రి ఎప్పుడో కదా జరుగుతుంది! రేపు రాత్రిదాకా ఇక్కడుంటాం! ఎప్పుడేనా చూడచ్చు!' అనుకుని తృప్తి చెందాడు రామం! రామానికి ఇప్పుడా అమ్మాయి పేరు తెలిసిపోయింది! "రత్నకుమారి!" ఎంత బాగుంది ఆ అమ్మాయి పేరు! ఎప్పుడూ నవ్వుతూ కళ్ళంతా వుంటుందా అమ్మాయి! అప్పుడే స్కూల్ ఫైనల్ పాసయిపోయిందట! తానింకా థర్డుఫారంలోనే వున్నాడు! ఆ అమ్మాయి అసలు తనతో మాట్లాడుతుందో లేదో! ఆ అమ్మాయి మరెవరో కాదు! వాళ్ళ మామయ్యగారి తోడల్లుడుగారమ్మాయి! తనకి వదిన వరస!!

ఆ రాత్రి భోజనాలయ్యాక, రామం వయసుగల మగపిల్లలందరూ ఒకగదిలో చిన్న గానకచ్చేరీ పెట్టారు! అందరూ తలో పాటాపాడాలని నిర్ణయించుకున్నారు! సరదాగా వింటున్నాడు రామం! అనుకోకుండానే తనవంతు కూడా వచ్చేసింది! ముందు కొంచెం సిగ్గుపడ్డాడు. పాడక తప్పదన్నారందరూ! ధైర్యంగా పాడడం మొదలెట్టాడు పాట కొంచెం బాగానే వచ్చింది! అందరి కంటే తనే బాగా పాడగలిగాననే తృప్తితో పాట ముగించాడు! అందరూ చప్పట్లు కొట్టారు! ప్రక్కపిల్లాడి మీదకు పోయింది పాట పాడవలసిన వంతు! ఆ పిల్లాడు తడుముకుంటున్నాడు! ఇంతలో ఆ రెండు జడలమ్మాయి రామం ఎదురుగా ప్రత్యక్షమయింది!

"అందరి కంటె ఈ అబ్బాయే బాగా పాడేడు! ఇతన్నే మరోపాట పాడమనండి!" అంటూ రామాన్ని చూపిస్తూ రామం ప్రక్కకువచ్చి కూర్చుంది! ఆ అమ్మాయితో పాటు మరో నలుగురమ్మాయిలు వచ్చారా గదిలోకి! రామానికి వాళ్ళందరూ కనిపించ లేదు! తన ప్రక్క ఆ అమ్మాయి కూర్చోడంతో రామానికి వొళ్ళంతా అదోలాగయింది! పాట పాడక తప్పలేదు! పాడేశాడు! అందరితో పాటూ ఆ అమ్మాయి కూడా చప్పట్లు కొట్టేసింది!

"వెరీ వెరీ గుడ్!" అంటూ లేచి, చకచకా నడిచి వెళ్ళిపోయింది! రామానికంతా అయోమయమయిపోయింది!

ఆ అమ్మాయిని ఎప్పుడో వంటరిగా కలుసుకుని ఏదైనా మాట్లాడాలనుకుంటాడు! తీరా సమయం చిక్కినప్పుడు, ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియక తికమక పడి, మెల్లిగా అక్కణ్నించి జారుకుంటాడు!

రత్నకుమారి— అప్పుడప్పుడు రామాన్ని వో కంట కనిపెడుతూ వుండేది! తనకంటె ఆపిల్లాడు చాలా చిన్నవాడిగా కనిపించినా,

అతని కళ్ళల్లో ఏదో వయస్సుకి మించిన తెలివి తనకు కన్పిస్తోంది! పెళ్లి చిక్కినప్పుడల్లా ఆ అబ్బాయి తనకేసే చూస్తున్నాడు! చాలా వింతగా చూస్తున్నాడు! తను అతని కేసైనా పలకరిద్దామనుకున్నా, కనీసం తన కంటిచూపుతోనైనా అతన్ని సంతృప్తి పరుద్దామనుకున్నా, ఆపిల్లాడు మరీ చాలా చిన్నపిల్లాడిగా కనిపించాడు! జాలిగా అతని కేసి చూసి, తన చూపు మరల్చేసేది!

ఆ పెళ్లి జరిగిపోయింది! రామం, వాళ్ళ వూళ్ళో బండి ఎక్కేసమయం ఇట్టే వచ్చేసింది! ఆమెకోసం వెతుక్కుంటూ వెళ్ళాడు రామం! చీరలూ అవీ పెట్టెలో సర్దుతోంది రత్నకుమారి!

"మావూరు వెళ్ళిపోతున్నానండీ!" జాలిగా అన్నాడు రామం!

ఒక్క అరనిముషం రామం కళ్ళల్లోకి చూసి, మౌనంగానే 'వెళ్ళి' రమ్మన్నట్టు తలవూపింది రత్నకుమారి! ఆమె తనతో ఎందుకు మాట్లాడలేదో అర్థంకాలేదు రామానికి! ఆమె తనకంటె నాలుగేళ్ళ పెద్ద! అందుకేనేమో!! రామం అక్కణ్నించి వచ్చేశాడు! అమ్మానాన్నలతో రైలెక్కాడు! వాళ్ళ వూరొచ్చేశాడు! 'ఛీ! అనవసరంగా ఆ పెళ్ళి కెళ్ళాము!' అనుకున్నాడు! ఆమె చేసిన భరతనాట్యం, తను పాడిన పాట, ఆ సంఘటనలన్నీ ఓ పదిరోజుల దాకా మరువలేకపోయాడు!

* * *

రామానికి పదహారేళ్లొచ్చాయి! స్కూల్ ఫైనలు పాసయి, కాలేజీలో చేరాడు ఆ సంవత్సరమే! కాలేజీలో ఒక రెండు జడలమ్మాయిని చూసినప్పుడు ఆ రోజు పెళ్లిలో తాను చూసిన రత్నకుమారి జ్ఞాపకం వచ్చింది! తనకిప్పుడు పదహారేళ్ళు వచ్చాయి! రత్నకుమారితో ఇప్పుడు, ధైర్యంగా మాట్లాడగలడు! తనకు తెలిసిన తమాషాలన్నీ చేసి ఆమెను నవ్వించి, ఆమెను తను ఆకర్షించవచ్చు! ఇంతకుముందు రత్నకుమారిలో తాను చూసిన చలాకీతనం తనలో ఇప్పుడు వుంది! మళ్లీ ఏదైనా పెళ్లిలో రత్నకుమారిని కలుసుకుంటే బాగుండును! చిన్నప్పటి కంటె కూడా ఇప్పుడు తను బాగా పాడగలడు! ఎలాంటి పాటనైనా పాడేస్తాడు!

ఆమెను కలుసుకునే సమయం ఎప్పుడు వస్తుందా అని అనుకుంటుండగానే ఆమె పెళ్ళి శుభలేఖ వచ్చింది రామం వాళ్ళనాన్నగారికీ!

## ఊహాలూ అనుభవాలూ

మొదట కొంచెం ఆశ్చర్యపడ్డాడు రామం! కొంతసేపటికి తనని తానే సమాధానపరచుకున్నాడు. 'ఆమెకప్పుడే ఇరవయ్యో యేడు వచ్చి యుంటుంది. పెళ్ళి జరగాల్సిన వయస్సే!' అని!

ఏదో పెళ్ళి సందర్భంగా, ఆమెను కలుసుకుందామనుకున్న వాడల్లా, ఆమె పెళ్ళికే ఆమెను చూడ్డానికి వెళ్తున్నాడతను! ఆమె నెలా చూస్తేనేం? ఇంతకుముందు ఆమె కనబరచిన చలాకీతనం తాను ఆమెకు చూపించాలి! కొంటెగా, అకతాయితనంతో ఆమెను ఆకర్షించాలి!!

వాళ్లింటి కెళ్లగానే, ఆమెను చూడాలన్న ఆతురత ఎక్కువయింది రామానికి! ఏ గదిలో వుంటుందో! ఏ నాట్యం చేస్తూ వుంటుందో!! ఎవరితో వేళాకోళాలాడుతూ వుంటుందో! ఎలాంటి వోణీలో కనిపిస్తుందో!!! రెండు జడలే ఫాషన్గా వేసుకుందో!!

పెళ్ళికూతురున్న గది తెలుసుకోడం ఎంతో కష్టమవలేదు రామానికి! తను లోపలికి వెళ్ళడాని కెవరూ అడ్డుపెట్టలేదు! గదిలో నుండి ఏదో పాట వినవస్తూంటే తొందరగా లోపలి కెళ్ళి చూశాడు! ఆశ్చర్యం! పాడేది పెళ్ళికూతురు కాదు! పెళ్ళికూతురు కోసం గది అంతా ఒక్కసారి కలయచూశాడు! గదిలో ఓమూల కనిపించింది పెళ్ళికూతురు! తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు రామం! అయిదేళ్ళ క్రితం తాను చూసిన రత్నకుమారికీ, ఈ రత్నకుమారికీ ఎంత తేడా వుంది!! తానను కున్నట్టు ఆ అమ్మాయి రెండు జడలేసుకోలేదు! ఇంతకుముందు కనుపించిన ఉత్సాహం ఆమెలో లేదు! ఒంటి జడ వేసుకుంది! ఆ జడనిండా పువ్వులున్నాయి! పట్టు చీర కట్టుకుంది! ఏదో చిత్రమైన బొట్టు పెట్టుకుంది! ముఖం పచ్చగా, బంగారంలా మెరుస్తోంది! వాళ్ళక్కయ్య వాళ్ళు ఏదో అంటోంటే పైకి చూసీ చూడనట్లు చూస్తూ సిగ్గుగా నవ్వుతోంది! వంటినిండా ఏవేవో అలంకరణలతో, ఆమె ఒక దేవతా విగ్రహంలా కనుపించింది!!

ఆమెతో ఎన్నెన్నో మాట్లాడాలనుకుని, ఆమె దగ్గర ఎన్నెన్నో చిలిపి పనులు చేద్దామనుకుని వచ్చిన రామం నిస్పృహ చెందాడు! అసలు పెళ్ళికూతురు దగ్గరి కెళ్ళడానికి వీలు చిక్కకుండా వుంది! ఆమె చుట్టూ ఎప్పుడూ నలుగు రాడాళ్ళుంటూనే వున్నారు!

రాత్రి భోజనాల సమయం! అందరూ చాలా హడావుడిగా వున్నారు! పెళ్లికూతురింకా ఆగదిలోనే వుంది! రామం అదను కనిపెట్టాడు! ధైర్యంగా లోపలికెళ్ళాడు!

"నేను జ్ఞాపకం వున్నానా?" చిలిపిగా కుర్ర ఉత్సుకతా, అడిగాడు!

"జ్ఞాపకం వున్నావు!" అనే అర్థం స్ఫురించేలా ఆమె అతి జాగ్రత్తగా, తల ఆడించింది, కొంచెంగా నవ్వుతూ!

"చిన్నప్పుడు బొగడచెట్టు క్రింద ఒకసారి దొంగాటాడుకున్నాం, జ్ఞాపకముందా?" ఆమె నుండి ఏదో మంచి సమాధానం రాబట్టాలని రామం ప్రశ్నించాడు!

మళ్లీ ఆమె అదే విధంగా తలాడించింది!

"ఇంతకుముందు మిమ్మల్ని చూసినప్పుడు భరతనాట్యం ఆడేరు మీరు! ఇప్పుడు కూడా ఆడుతున్నారా? ఆ రోజున మీరు చేసిన డాన్సు ఎంతో బాగుంది!"

ఆమె అడ్డంగా తల త్రిప్పింది, 'ఇప్పుడు నేను డాన్సు చేయడం మానేశాను!' అని అర్థం వచ్చేటట్లు!

రామం ముఖం చిన్నబోయింది!

ఆమె నెలా మాట్లాడించాలి?

"మీరింతకుముందులా ఉత్సాహంగా కనుపించరేం?" తన మనసులో వున్న భావాన్ని బయటపెడుతూ అడిగేశాడు రామం!

రత్నకుమారి జాలిగా అతనికేసి చూసింది "అప్పుడు నా వయసు పదిహేనేళ్ళు! ఇప్పుడు ఇరవై!" అనేసి, కొంటెగా అతనికి కావలసిన విధంగా ఒక్కసారి నవ్వింది! ఆ నవ్వు చూసి ఏదో తెలియని అనుభూతి పొందేడు రామం! ఆమె సమాధానం మాత్రం రామానికి తృప్తిగా లేదు!

ఎవరో వస్తున్న అలజడి కావడంతో, రామం బయటికి వొచ్చేశాడు. పెళ్ళిపీటల మీద, మిగిలిన సందర్భాల్లోనూ రత్నకుమారిని చూస్తూనే వున్నాడు రామం!

ఆమె ప్రవర్తనలో, ఆమె మాటల్లో, ఆమె చూపుల్లో ఆమె నడకలో, ఏదో ప్రత్యేకత తను చూస్తూ అనుభవిస్తున్నాడు రామం! కాని, తన భావాలు ఎవరికీ చెప్పుకోలేదు! చెప్పకూడదు! ఆ భావాలామెకే చెప్పాలి! అదీనా ఇప్పుడు కాదు! తాను ఇరవ

ద్యోళ్ళ వాడదాక చెప్పాలి! ఆ పైనాడు ఆమె తప్పకుండా వింటుంది! తనకి కావలసిన సమాధానం ఇస్తుంది!

ఆమె పెళ్ళి జరిగిపోయింది!

రామం ఇంటికి వచ్చేశాడు!!

*   *   *

రామం ఇరవయ్యేళ్ళ వాడయ్యాడు. చదువు పూర్తయింది. ఉద్యోగంలో కూడా ప్రవేశించాడు. తన పెళ్ళి విషయమై తల్లి దండ్రులు తన్ను కంగారు పెడుతున్నారు. పెళ్ళి చూపులకి వెళ్ళివచ్చాడు! ఆ అమ్మాయి ఏమాత్రం నచ్చలేదు! రత్నకుమారి పెళ్ళి కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తోంది రామానికి! ఆనాటి పెళ్ళికూతురు తన కంటిగానో వచ్చింది. ఆ రూపాన్ని తల్చుకున్న కొద్దీ తల్చుకో బుద్ధి అవుతోంది! తన మనసులో ఏదో కలవరం బయల్దేరింది! రత్నకుమారి లాంటి పెళ్ళికూతురు తనకు మళ్ళీ దొరకదు! రత్నకుమారి, రత్నకుమారే! ఒకసారి ఆమెను చూడాలి! తన మనసులో వున్న ఆవేదన ఆమెకు చెప్పుకుని తృప్తి చెందాలి! తన భావాలు తెలుసుకుని ఆమె తనని తప్పక మెచ్చుకుంటుంది! తనని ఓదారుస్తుంది! ఆమె తన ఆరాధ్య దైవం!!

తలిదండ్రులతో ఏదో సాకు చెప్పి, ఆమె ఉంటున్న ఊరు వెళ్ళాడు రామం!

రత్నకుమారి, ఆమె భర్త కూడా తనను ఎంతో ఆప్యాయతతో ఆహ్వానించారు! రత్నకుమారి కొంచెం నీరసంగా కనిపించింది!

స్నానంచేసి సావకాశంగా పుస్తకం చదువుకుంటూ పడుకున్నాడు మేడ మీద! ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు! అతనికి మెలకువ వచ్చేసరికి మాత్రం రత్నకుమారి ఎదురుగా కనుపించింది! రామాన్ని భోజనానికి రమ్మని పిలిచింది! చుట్టూ కలయచూశాడు రామం! ఆమె భర్త ఆఫీసు కెళ్ళిపోయినట్టు! ఇంట్లో మరెవ్వరూ లేరు!

"మీరు తప్పుగా అర్థం చేసుకోపోతే మిమ్మల్ని నేనొకటడగొచ్చా వదినా?" ఇన్నేళ్ళుగా ఆమెతో చెప్పాలనుకున్న విషయాలన్నీ చెప్పేయాలని, అడిగేడు రామం!

రామాన్ని చూసి జాలిపడింది రత్నకుమారి! 'పిచ్చిపిల్లాడు' అనుకుని చిన్నగా నవ్వుకుంది. "ఏమీ అనుకోనులే, అదే మిటో అడిగెయ్!" అంది గుమ్మానికి జార్లబడి!

"మామయ్యగారి - రెండో అమ్మాయి పెళ్ళిలో నాట్యం చేశారు మీరు! ఆ నాట్యములో ఓ భంగిమతో మీరు ఒక్క నిముషం నుంచుంటే చూసి ఆనందిద్దామని వుంది!"

"అంతేనా!" జాలి కురిపిస్తూ తేలిగ్గా అడిగింది రత్నకుమారి.

"మీరు నిజంగానే ఏమీ అనుకోపోతే, మరో చిన్నకోరిక, మీ పెళ్ళినాడు నేను మీతో మాట్లాడ్డానికి వచ్చినప్పుడు నేను అడిగే ప్రశ్నలన్నింటికీ తల ఆడిస్తూ జవాబిచ్చారు! ఎలా గిచ్చారో ఒక్కసారి చూపించరూ?"

రత్నకుమారి చిన్నగా నవ్వి, మౌనంగా ఒక్కనిముషం అతని కళ్ళల్లోకి చూసింది!

అదను చిక్కింది రామానికి!


"వదినా! మీరు చదువుకున్నవారు! ఇలాంటి కోరిక కోరేనేమిటని నన్ను నీచంగా అర్థం చేసుకోరనుకుంటాను! కళాత్మకమైన మీ ప్రవర్తన చిన్ననాటి నుండీ నన్ను ఆకర్షించింది! ఆ విషయం మీకు చెప్పి, మీమెప్పు పొందాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను! మీరు నాకు అవకాశం ఇవ్వలేదు! బహుశా మీ కంటే నేను నాలుగేళ్ళు చిన్న వాడ్నని మీరు నన్ను చాలా తేలిగ్గా అర్థం చేసుకుని వుంటారు! నిజం చెప్పండి వదినా! ఏ విషయంలో మీకంటె చిన్నవాడ్ని నంతమాత్రాన, నేను మీకంటె దేంట తక్కువ? చదువు సంస్కారాల్లోనా? ఊ గానాల్లోనా? అందచందాల్లోనా?"

రత్నకుమారి ఇంకా మౌనంగానే ఓ బడింది! రామం ఆవేశం అణగిపోయింది!

"అడగవలసిందంతా అడిగేశావు! ముందు వచ్చి భోంచెయ్యి! తరవాత నీ సం దేహాలన్నీ తీరుస్తాను!" అంటూ అతని సమాధానం కోసం నిలబడకుండా, మేడమెట్లు దిగి వెళ్ళిపోయింది! ఆమె తననేదో ఆజ్ఞాపించినట్లుయింది రామానికి! కిక్కురుమనకుండా ఆమె ననుసరించాడు!

వంటింట్లో తానడుగు పెట్టేసరికి టేబుల్ మీద అన్నీ నీట్‌గా ఏర్పాటు చేయబడి వున్నాయి! మాట్లాడకుండా అన్నం కలుపుకున్నాడు. కుంపట్లో నిప్పుల మీద నున్న నేతి గిన్నెను చేత్తో పట్టుకుని గబగబా తెచ్చి టేబుల్ మీద ఉంచింది రత్నకుమారి! నేయి వేసుకుందామని ఆగి పట్టుకోబోయాడు! చెయ్యి కాలింది! కంగారుగా వదిలేశాడు! గిన్నె క్రిందపడబోయింది!

"అరే కాల్తోందే! మీరెలా పట్టుకోగలిగారు?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ!





everest/363a/Acw u,


# ఊహలూ అనుభవాలూ

"అప్పుడే పాలుగేళ్ల నుంచి సంసారంలో అనుభవం సంపాదించాను! ఈమాత్రం వేడికి నా చెయ్యి కాలిపోదు!" అంది రత్నకుమారి నవ్వుతూ!

రామం తెల్లబోయాడు!!

"ఇప్పటికేనా అర్థమయిందా రామం, నీవు నాకంటె దేంట్లో తక్కువ వాడవో?" తేలిగ్గా అనేసింది రత్నకుమారి స్తంభానికి జార్లపడి! "చిన్నప్పటి నుండీ అనుకుంటూనే వున్నాను. నీవు వెర్రి రామానివని! తెలివి ఊహల్ని పెంచుతుంది! వయసు అనుభవాన్నిస్తుంది! జీవితంలో ఉపయోగించేవి ఊహాలు కావు! అనుభవాలు!! ఊహాలుంటే మంచిదే! కాని వాటికి అనుభవాలని జత పరచినప్పుడే అవి ఉపయోగిస్తాయి! నీకే గనుక పెళ్లాయి వుంటే, ఇందాక అడిగిన రెండు కోరికలూ కోరడానికి నువ్వు సందేహించే వాడివి! ఇది చెప్పినా అర్థంకాదు. అనుభవం మీద నీకే తెలియాలి!"

చెంప మీద ఛెళ్ళన కొట్టినట్లున్నాయి ఆమె మాటలు! రామం సిగ్గుపడిపోయాడు గబగబా భోజనంపూర్తి చేసుకుని, తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేసుకున్నాడు! అతను వెళ్లేముందు రత్నకుమారి అంది. "నిన్ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు! జరిగిందానికి ఊరికే బాధపడకు! తేలిగ్గా తీసుకో!"

"ఎంత అనుభవంతో చెప్పిన మాటలవి?" అనుకుంటూ రామం రైలెక్కాడు! రైలు వేగంగా పరిగెత్తుతోంది! కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్నాడు రామం! రామం, రత్నకుమారీ ఆకాశంలో కనిపిస్తున్నారు రామం పదహారేళ్ల విద్యార్థిలాగుంటే, రత్నకుమారి ఇరవయ్యేళ్ల పెళ్లికూతురులా వుంది! రామం ఇరవయ్యేళ్ల పెళ్లికొడుకులా కనిపిస్తే, రత్నకుమారి ఆరునెలల పసిపాపకు పాలిస్తూన్న తల్లిలా కనిపించింది! రామం ఇంకా పెద్ద వాడయినప్పుడు రత్నకుమారి అంతకంటే పెద్దదానిలా కనిపించింది! వాళ్లిద్దరికీ మధ్య ఆ నాలుగేళ్ల తేడా, ఎప్పుడూ వుంది! ఇంక ఈ జీవితంలో రామం, రత్నకుమారీ అలా, ఆ నాలుగేళ్ల తేడాతో గడపవలసిందే! ●